రాముడు దేవుడా?

చాలా మంది మనసులని ఒక సంశయం దొలుస్తుంటుంది. అది "శ్రీరాముడు దేవుడా? మానవ మాత్రుడా?" అని. అసలు దేవుడంటే ఎవరు? సత్ప్రవర్తనతో, స్వార్థ రహితంగా, సదాచార సంపన్నుడై జీవితం గడుపుతూ, దుష్ట శిక్షణ శిష్ట రక్షణతో అనుక్షణం మానవ కళ్యాణాన్ని కాంక్షిస్తూ అందరికీ ఆదర్శప్రాయుడై వుండేవాడు. సరిగ్గా దీనికి వ్యతిరేకంగా ప్రవర్తించేవారు రాక్షసులు. దేవుడు అనగానే పూజించాలనుకోవడం వల్లనే సమస్యలు వస్తాయి. దేవుడ్ని 'పూజలు పునస్కారాలతోటి సంతృప్తి పరచి కోరికలు తీర్చుకోవడానికి' అన్న అర్థంలో కాకుండా 'అనుసరణీయుడు' అన్న భావంతో సేవిస్తే ఎటువంటి అపార్థాలకి ఆస్కారం వుండదు.

శ్రీరాముడు తల్లిదండ్రుల, గురువుల ఆజ్ఞను శిరసావహించి ఉత్తమ కుమారుడు అత్యుత్తమ శిష్యుడు అనిపించుకున్నాడు. సహోదరులను సమాదరించాడు.స్నేహితుల క్షేమాన్ని కాంక్షించాడు. ఆతల్లి సీతమ్మ అపహరించబడితే శోకతప్త హృదయంతో తల్లడిల్లిపోయాడు. ఆ అమ్మ తిరిగి తనను చేరేదాకా విశ్రమించలేదు. ఒక మంచి భర్తకి ఇంతకన్నా ఉదాహరణ ఇంకేమి కావాలి? రావణాసురుణ్ణి సంహరించినా ఒక్కరుకూడా తప్పు పట్టలేదు కారణం దుష్టత్వం నశించాల్సిందే! అది ఏ కాలంలో అయినా ఆమోదయోగ్యమే! చాకలి వాడేదో అన్నాడని అంతటి చక్రవర్తి కూడా పెడ చెవిన పెట్టలేదు. తన ప్రవర్తన గురించి ఏ ఒక్కరు వేలెట్టి చూపించే ఆస్కారం ఇవ్వకూడదన్న ఉన్నత సంస్కారం. ఒక మంచి పాలకుడిగా జేజేలు అందుకున్నాడు. ఆంజనేయుడివంటి శక్తిశాలి తన సేవకుడయ్యేలా చేసుకోగలిగిన వ్యక్తిత్వం ఆ మహానుభావుడిది. శబరిలాంటి ఆటవిక స్త్రీ సపర్యలు అందుకున్న ఉదాత్తపురుషుడు..అహల్యా శాప విమోచనంతో స్త్రీజాతిని ఉద్ధరించిన కైవల్యరాముడు. విభీషనుడు శత్రునింటనుండి వచ్చినా అనుమానించక తోడబుట్టినవానిలా అక్కున చేర్చుకున్నాడు.

ఇలా బాల్యం నుండి పెద్దతనం వరకు కారణ జన్ముడిలా అహరహం అనేక సందర్భాల్లో తనదైన నడవడికతో ఒక ప్రత్యేక ముద్రవేసుకున్న వ్యక్తి మరొకడు లేడు. ఆయన జీవిత పార్శ్వంలోని ఏ భాగం స్పృశించినా మనకి తన్మయత్వ భావన కలుగుతుంది. ఏ బలహీనతలూ లేకుండా మనిషి మనుగడ అసాధ్యం, అలాంటిది వెతికి చూసినా ఎక్కడా ఎటువంటి వికారం గోచరించదు. మనుషుల్లో మహాత్ముడు..మాననీయుడు కాబట్టే ప్రతి వీధిలోనూ, మనసుల్లోనూ గుళ్ళు కట్టుకుంటాం..ప్రతిక్షణం తల్చుకుంటాం..కళ్యాణాలు జరిపిస్తాం..ఇవన్నీ ఆధ్యామిక భావంతో కాదు మంచిని తల్చుకుంటే అది మన మనస్సుల్ని పవిత్రం చేస్తుందనీ..తద్వారా ఉత్తమ పౌరులమౌతామని అలా అలా ఉత్తమ సమాజం ఆవిష్కృతమవుతుందని..అంతేగాని మరో ఉద్దేశ్యం లేదు. ఆబాలగోపాలం ఆ శ్రీరామచంద్రుడిని సదా దర్శిస్తూ..నిత్యం స్మరిస్తూ ధన్యులైతే అందరం దైవత్వాన్నందుతాం! ఏమంటారు?

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు

"ఈ రచన నా సొంతం..అనుసరణ కాని..అనుకరణ కాని కాదు..ప్రసారం కాలేదు"

ప్ర. వెం. సుబ్బారాయుడు

చిరునామా:
ప్లాట్ నం:B-40
రోడ్ నం:4
జె జె నగర్
సైనిక్ పురిపోస్ట్
సికింద్రాబాద్

**500 094**
**సెల్: 9393981918**